విశాలాంధ్ర
కృష్ణా జిల్లా

వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా మహాసభ జయప్రదం చేయాలి

విశాలాంధ్ర-కూచిపూడి : ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం కృష్ణాజిల్లా 23వ మహాసభ ఆగస్టు 12వ తేదీన కృష్ణా జిల్లాలోని ఈడుపుగల్లు ఎస్‌జిఎస్‌లో ఉదయం 9 గంటలకు ప్రారంభమవుతుందని, ఆ సమావేశానికి పామర్రు నియోజకవర్గం నుంచి అధికసంఖ్యలో వ్యవసాయ కార్మికులు తరలివచ్చి జయప్రదం చేయాలని నియోజకవర్గ అధ్యక్ష కార్యదర్శులు బోరుకాటి నరసింహారాజు, చందోలు నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. కూచిపూడి పెదపూడి సెంటర్‌లోని చలసాని కాంచనరావు (సీపీఐ) కార్యాలయంలో ఆదివారం మాట్లాడుతూ తొమ్మిది దశాబ్దాలుగా గ్రామీణ కష్టజీవులకు ఉపాధి, సాగుభూములు, సామాజిక న్యాయం కోసం పోరాడుతున్న వ్యవసాయ కార్మిక సంఘం బలోపేతానికి ప్రతి వ్యవసాయ కార్మికుడు ముందుకు రావాలని సూచించారు. జిల్లా మహాసభ సందర్భంగా త్వరలో పామర్రు నియోజకవర్గ సమావేశాన్ని నిర్వహిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి ఆవుల శేఖర్, సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కేబీవీ ప్రసాద్, సీపీఐ జిల్లా ఇన్‌ఛార్జి కార్యదర్శి టి.తాతయ్య, జిల్లా సహాయ కార్యదర్శి అడ్డాడ ప్రసాద్, ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి కోశాధికారి ఆర్ పిచ్చయ్య, కృష్ణాజిల్లా రైతు సంఘం కార్యదర్శి గుత్తికొండ రామారావు, కృష్ణాజిల్లా మహిళా సమాఖ్య కార్యదర్శి మల్లు పెద్ది రత్నకుమారి, పెనమలూరు నియోజకవర్గ సమితి కార్యదర్శి మున్నంగి నరసింహారావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కన్వీనర్ మేరుగు విజయకుమార్ ఈ కార్యక్రమంలో పాల్గొంటారని వివరించారు. సీపీఐ మండల కార్యదర్శి తెలుగు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

దివిసీమలో ముమ్మరంగా వ్యవసాయ పనులు

ఈ ఖరీఫ్‌లో పూర్తి స్థాయిలో సాగునీరు అందేనా

దివిసీమలో ముమ్మరంగా వ్యవసాయ పనులు

దివిసీమలో రైతులు వ్యవసాయ పనులను ముమ్మరం చేసారు. బంగాళఖాతంలో నైరుతి రుతుపవనాల దృష్ట్యా అల్పపీడన ఉపరితల ఆవర్తనం ఏర్పడటంతో ఆకాశం మేఘావృతమై వర్షాలు పడుతుండటంతో రైతులు వ్యవసాయ పనులలో భాగంగా నారుమడులకు పొలంను సిద్ధం చేసుకుంటున్నారు. ఒక పక్క రైతులు నారుమడులు సిద్ధం చేసుకొని విత్తనాలు చల్లుతుండగా మరోపక్క రైతులు నారుమడులకు పొలాన్ని దమ్ము చేస్తున్నారు. రైతులు విత్తనాల కొనుగోలుతో పాటు ఆకుమడులు సిద్ధం చేసుకోవడం పిల్లి పెసర, జీలిగ విత్తనాలు చల్లడం వంటి పనులలో దివిసీమ రైతాంగం నిమగ్నమైయ్యారు.

విశాలాంధ్ర-అవనిగడ్డ :- దివిసీమలో రైతులు వ్యవసాయ పనులను ముమ్మరంగా చేస్తున్నారు. ఒక ప్రాంతంలో రైతులు ఆకుమడులకు విత్తనాలు చల్లుతుంటే ఆకుమడులు సిద్ధం చేయడం ఆకుమడులకు దమ్ము చేయడం వంటి పనులు వేరే వేరు ప్రాంతాల్లో రైతులు నిర్వహిస్తూ తలమునకులు అయ్యారు. గడిచిన 4 సంవత్సరాలు దివిసీమకు సాగునీరు పూర్తి స్థాయిలో వచ్చినప్పటికి ఈ సంవత్సరం ఆ స్థాయిలో సాగునీరు రాదేమోనని దివిసీమ రైతాంగంలో ఆందోళన నెలకొంది. గత నెల చివరిలో దివిసీమకు సాగు, తాగునీటిని పులిగడ్డ ఎల్ఎఫ్ఆర్ వద్ద ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు నీటిని విడుదల చేశారు. గత సంవత్సరం కంటే 12 రోజులు నీటిని ముందుగా విడుదల చేసినప్పటికీ రైతులు ఆ విధంగా ముందుగా వ్యవసాయ పనులు మాత్రం ప్రారంభించలేదు. దిగువ ప్రాంతంలో ఎక్కువ మంది రైతులు బిపిటి విత్తనాలు సాగుచేస్తూ ఉంటారు. ఆగష్టు మొదటి వారం నుండి రైతులు నాట్లు వేసేందుకు శ్రీకారం చుడతారు. ఉమ్మడి రాష్ట్ర సీఎంగా కిరణ్‌కుమార్ ఉన్న సమయంలో కృష్ణా డెల్టా రైతాంగాన్ని మున్నెరు డ్రైను మాత్రమే కాపాడింది. ఆ సంవత్సరం శ్రీశైలంలోగానీ, నాగార్జునసాగర్ నుండి గానీ కృష్ణా డెల్టాకు సాగు, తాగునీరు ఏమాత్రం రాకపోయినా నాలుగు మూడు పర్యాయాలు ప్రకాశం బ్యారేజికి పైన మున్నేరు ప్రాంతంలో వర్షాలు పడటంతో ఆ నీటితోనే కృష్ణా రైతాంగం పంటలు పండించుకున్నారు. తర్వాత వచ్చిన తెలుగుదేశం ప్రభుత్వంలో పులిచింతల నుండి మోటర్ల ద్వారా వచ్చిన నీటితో రైతాంగం పంటలు పండించుకోగా ప్రస్తుతం అధికారంలో ఉన్న వైసిపి ప్రభుత్వం గడిచిన 6 సంవత్సరాలలో పులిచింతల నుండి నీటిని సరఫరా చేయ్యకపోయినా శ్రీశైలం, నాగార్జున సాగర్ నుండి పూర్తిస్థాయిలో ప్రకాశం బ్యారేజికి నీరు రావడంతో సాగునీటి కష్టాలు ఏవిధంగా ఉంటాయో దివిసీమ రైతాంగం మరిచారు. ప్రస్తుతం శ్రీశైలం నాగార్జున సాగర్‌లో నీటి నిల్వలు ఆశించిన స్థాయిలో లేకపోవడం ఎగువ ప్రాంతోల్లో వర్షాలు కూడా కురవకపోవడంతో కృష్ణా బ్యారేజికి ఆశించిన స్థాయిలో నీటి సరఫరా జరగటం లేదు. ఇప్పటి వరకు కృష్ణా బ్యారేజిలో ఉన్న నీటిని మాత్రమే విడుదల చేస్తున్నారు. మరో 15 , 20 రోజులలో రైతులు పూర్తి స్థాయిలో నాట్లు వేసేందుకు సిద్ధం అవుతారు. అప్పుడు పుష్కలంగా పంట పొలాలకు నీటి అవసరం ఉన్నది. ప్రస్తుతం గోదావరి నదికి వరదలు అయితే ప్రారంభం అయ్యాయి కానీ ఆ నీరు ఏ స్థాయిలో పులిచింతల చేరుతుందో అర్థం కాని పరిస్థితి. ఈ సంఘటనలు అన్నీ దివిసీమ రైతాంగం పరిశీలించుకుంటూ సాగునీటి కష్టాలు తప్పవేమోననే రీతిలో రైతాంగం వ్యవసాయ పనులు ప్రారంభించారు. అధికారులు ప్రజా ప్రతినిధులు సాగునీటిపై స్పష్టమైన హామీలు ఇచ్చి రైతాంగానికి భరోసా కల్పించాల్సిన అవసరం కూడా ఉన్నది. దివిసీమ ప్రాంత రైతాంగం అతివృష్టి, అనావృష్టి తో ప్రతి సంవత్సరం ఏదోవిధంగా నష్ట పోతున్నా ఏ ప్రభుత్వం వచ్చినా రైతులు మాత్రం ఆదుకోవడంలో విఫలం అవుతూనే ఉన్నారు. ఆరుగాలం కష్టపడి పండించిన పంటకు ప్రభుత్వాలు మాత్రం గిట్టుబాటు ధర కల్పించి రైతులకు భరోసా ఇవ్వలేకపోతున్నారు. ఈ సంవత్సరం రైతులు ముందుగానే సాగునీటిపై ఆలోచన చేస్తూ వ్యవసాయ పనులకు శ్రీకారం చుడుతున్నారు.

గుర్రపు డెక్క తొలగించరా?

ఆగ్రహం వ్యక్తం చేస్తున్న రైతులు

విశాలాంధ్ర-కూచిపూడి : ఒకవైపు కురుస్తున్న వర్షాలు, మరొకవైపు ముమ్మరంగా సాగుతున్న వరినాట్లు పనులు ఈ తరుణంలో గుర్రపు డెక్క తొలగింపు కార్యక్రమం విమర్శలకు తావిస్తోంది. ఐనంపూడి డ్రైన్‌లో అయ్యంకి నుంచి కాజవరకు తూటు తొలగింపు కార్యక్రమానికి రూ. 20 లక్షల కాగా ప్రస్తుతం పనులు మొదలుపెట్టిన పనులు అసంపూర్తిగా చేస్తున్నాడు. వేసవికాలంలో అయితే తోటి కాడ మీద రసాయనాల మందు జల్లి తొలగింపు చర్యలు చేపడితే బాగుండేదని రైతుల అభిప్రాయపడ్డారు. ప్రస్తుతం దట్టంగా ఉన్న గుర్రపు డెక్క అయ్యంకి, చినముత్తేవి, కాజ వంతెనల వద్ద పట్టేసుకుపోయింది. గోటితో పోయేది గొడ్డలి దాకా ఎందుకని పెద్దల నానుడి ప్రస్తుతం కొనసాగిస్తున్న గుర్రపు డెక్క తొలగింపు పనులకు వర్తిస్తుందని వివిధ రాజకీయ పార్టీల నేతలు, రైతులు పేర్కొనటం గమనార్హం!. గత నెల రోజులనుండి వర్షాలు కురుస్తుండటంతో వరి నాటు వేసిన పొలాలస అయితే ముంపు పాలు అయినాయి. దీనికి కారణం ఈ కాలంలో దత్తంగా గుర్రపు డెక్క అల్లుకుపోవడమేనని రైతులు విపరీతంగా ఆందోళన చేశారు. వేసవికాలంలో చేయాల్సిన ఈ పనులను వరినాట్ల సమయంలో నిర్వహించడం పూర్తిస్థాయి న్యాయం జరుగుతుందా? అనే అనుమానాలను సైతం రైతులు వ్యక్తం చేస్తున్నారు. ఈఏడాది మార్చి నుంచి జూన్ 15వ తారీకు వరకు ఎండలు విపరీతంగా వేశాయి. ఆ తరుణంలో దట్టంగాఅల్లుకుపోయిన గుర్రెపుడెక్కతొలగించి కట్టలు బలబరిస్తే ఈ నెల రోజుల్లో కురిసిన అధిక వర్షాలకు పొలాలు బొంపు పాలుఅయ్యేవి కాదని రైతులు స్పష్టం చేస్తున్నారు. ఇదే పరిస్థితి అటు భీమనేది డ్రైన్ లో ఇటు ఉప్పాయి కోడు డ్రైన్ లోకూడా ఉంది. ఈ ఏడాది అల్పపీడనాల వలన అధికంగా కురుస్తున్న వర్షాలతో వేలాది ఎకరాలు ఖరీఫ్ సీజన్ ప్రారంభంలోనే ముంపుబపాలవటంతో వరి సాగుకు ఖర్చుపెట్టిన ప్రతి రూపాయి బూడిదలో పోసిన పన్నీరు మాదిరిగానే మారుతోందని రైతన్నలు తమ ఆవేదన వ్యక్తం చేయడానికే పరిమితమైనారు. అటు అధికారులు గానీ ఇటు ప్రజాప్రతినిధులు గాని తూటు తొలగింపు పై దృష్టి సారించ (లే)క పోవటంతో రైతులు పడుతున్న బాధలు వర్ణనాతీతం.!

జులుం చేస్తే తాట తీస్తా...

- రౌడీషీటర్లకు ఇదే ఫైనల్ వార్నింగ్

- సీఐ అబ్దుల్ సలాం

విశాలాంధ్ర-విజయవాడ (క్రైమ్): గతంలో ఏం జరిగిందో నాకు తెలి యదు.. పద్ధతి మార్చుకోండి...ఇదే ఫైనల్ వార్నింగ్.. కాదని జులుం చేస్తే తాట తీస్తా' అని భవానిపురం సీఐ అబ్దుల్ సలాం రౌడీషీటర్లను హెచ్చరించారు. ఆదివారం భవానిపురం పోలీస్ స్టేషన్ ప్రాంగణంలో రౌడీషీటర్లకు సీఐ కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రౌడీషీటర్ల కదలికలపై పోలీసు నిఘా దగ్గరగా ఉంటుందన్నారు. ఈ విషయాన్ని గమనించి ఒళ్లు దగ్గర పెట్టకొని తమ ప్రవర్తనను మార్చుకోవాలన్నారు. దందాలు, పంచాయతీలు మానుకోవాలన్నారు. తామేమి చేసినా ఎవరూ ఏమీ చేయలేరని విర్రవీగితే తగిన బుద్ధిచెబుతామన్నారు. ఇకపై ఏదైనా నేరం చేసినా, చేయించినా భారీ మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. ప్రతి వారం విధిగా పోలీసుస్టేషన్‌లో హాజరువేయించుకోవడంతో పాటు అసాంఘిక శక్తులు, కార్యక్రమాలపై సమాచారం అందించాలన్నారు. లేనిపక్షంలో ఆయా ప్రాంతాల్లో జరిగే నేరాలకు అక్కడున్న రౌడీషీటర్లే నైతిక బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. ప్రజాజీవనానికి, శాంతి భద్రతలకు విఘాతం కల్గిస్తే దండన తప్పదన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సైలు రవీంద్ర బాబు, అనూష, లాలం ప్రసాద్, రామారావు , తదితరలు పాల్గొన్నారు.

'గడపగడపకు మన ప్రభుత్వం' నిధులు రూ.కోటి మంజూరు : సర్పంచి కొడాలి భవాని

విశాలాంధ్ర-కూచిపూడి : ఈ నెలలో 20 రోజులు పాటు కాజ-1, కాజ-2 సచివాలయాలలో నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా ఈ రెండు సచివాలయాలలోపలుఅభివృద్ధి కార్యక్రమాలకు పామర్రు నియోజకవర్గ శాసనసభ్యులు కైలే అనిల్ కుమార్.రూ.కోటి మంజూరు చేశారని కాజ గ్రామ సర్పంచ్ కొడాలి భవాని ఆదివారంవిలేకరులకు తెలిపారు. వీటిని సంబంధిత అధికారులతో చర్చలు నిర్వహించి ఆయా అవసరాలకు వినియోగించనున్నామని, తెలిపారు. అదేవిధంగా రోడ్లు భవనాల శాఖ అధికారులతో సమీక్షించి గుంటలు పడిన ప్రాంతాలలో అభివృద్ధికి అంచనాలు తయారు చేయవలసిందిగా ఆదేశాలు జారీ చేశారని ఆమె వివరించారు. వాటికి సంబంధించిన పనులు మొదలు పెట్టడానికి సన్నాహాలు చేస్తున్న తరుణంలో పామర్రు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీసమన్వయకర్త వర్ల కుమార్ రాజా కార్యకర్తలతో కలిసి రహదారులపై ప్రకటనలు చేయటం హాస్యాస్పదంగా ఉందని అభి వర్ణించారు. ఈ విధమైన బూటకపు చేష్టలను మానుకోవాలని ఆమె హితవు పలికారు. ఈమెతో పాటు మండల పరిషత్ సభ్యులు పేకేటి వెంకటలక్ష్మి(కాజ-1),, ఎల్లమల్లి కుటుంబరావు(కాజ-2), ఉప సర్పంచ్ మంద శ్రీనివాసరెడ్డి, పిఎసిఎస్ అధ్యక్షులు జోగి రామచంద్ర రావు తదితరులు పాల్గొన్నారు.

నేడు మణిపూర్‌లో దాడులపై రౌండ్ టేబుల్ సమావేశం

విశాలాంధ్ర-గుడివాడ : మణిపూర్‌లో జరుగుతున్న ట్రైబల్ మైనారిటీల మీద దాడులను ఖండిస్తూ 24వ తేదిన పలు సంఘలతో రౌడ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహిస్తునట్లు దళిత ఐక్యవేదిక నాయకుడు పొంగులేటి జయరాజు తెలిపారు. ఆదివారం స్థానిక గుడ్‌మెన్‌పేటలోని ఐక్యవేదిక కార్యలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో అయన మాట్లాడుతూ సోమవారం ఉదయం 10గం॥ల 30 ని॥లకు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ భవనంలో టీడీపీ, సిపిఐ, సిపియం, జనసేన, దళిత ఎస్‌సిలు క్రిస్టియన్, బీసీ సంఘాల ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశాన్ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ సభకు ప్రతి ఒక్కరు పాల్గొని జయప్రదం చేయాలని దళిత ఐక్యవేదిక నాయకులు దారం కరుణాకర్ కంచర్ల సుధాకర్ దారం ఉపేంద్ర, మరియబాబు, పాల్, శ్రీనివాసరావులు పిలుపునిచ్చారు.

భారత్ డిఎపిఎన్‌పికే కాంప్లెక్స్ ఎరువులు ప్రవేశం

విశాలాంధ్ర-విజయవాడ(చిట్టినగర్): తెలుగు రాష్ట్రాలలో(ఆంధ్ర, తెలంగాణ) రైతాంగానికి మేలు చేసే రెండు రకములైన భారత్ డిఎపి, ఎన్పికే ఎరువులను ప్రారంభిస్తు న్నామని, మూనారా ఆగ్రో టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ ఫౌండర్ అండ్ డైరెక్టర్ జెఎన్ఏ మూర్తి తెలిపారు. ఓస్వాల్ ఫోస్కెం (ఇండియా) లిమిటెడ్ అనుబంధ సంస్థ అయిన క్రిషానా ఫాస్కెమ్ లిమిటెడ్ వారు అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో తయారుచేసిన ఎరువులను కార్యక్రమాన్ని విలేకరుల సమావేశంలో విజయవాడ గుణదల సెంటర్ ఆయారా ప్లైస్ హాల్ లో ప్రవేశపెట్టారు. ఈ కార్యక్రమంలో మునారా ఆగ్రో టెక్నాలజీస్ సంయుక్త ఫౌండర్స్, డైరెక్టర్స్ జేఎన్ఏ మూర్తి, శ్రీ రాముల నాయుడు, కంపెనీ ఇతర డైరెక్టర్లు, ప్రతినిధులు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

సుశీల్ కుమార్‌కు గానకళానిధి బిరుదు

విశాలాంధ్ర-విజయవాడ కల్చరల్ : జెపి అండ్ రాజ్ స్వరాంజలి ఆర్కెస్ట్రా 33 వ వార్షికోత్సవం ఆదివారం సాయంత్రం కౌతా పూర్ణానందం కళావేదికపై ఘనంగా జరిగింది. మెగా జనరంజని పార్ట్ 3 గా జరిగిన సినీ సంగీత విభావరి ఆహూతులను పరవశింపజేసింది. ఇదే వేదికపై నరసరావుపేట సీనియర్ సినీ గాయకులు డాక్టర్ సుశీల్ కుమార్ కు జనరంజక గాన కళానిధి బిరుదును శ్రోతల కరతాళ ధ్వనుల మధ్య ప్రదానం చేశారు. ఆదిరాల జయప్రభు,డేవిడ్ రాజు,జోషి, ఆదిరాల బాల పృథ్వీరాజ్, రామశంకరరావు,స్వాతి మీరా కుమార్,అమలారాణి,భారతి,మీనా కుమారి,రేష్మ,సయ్యద్ అలీ, అయ్యప్పన్,బాబురావు,అబ్రహం తదితరులు పలు చిత్రాలలోని పాటలను రసరమ్యంగా పాడి వినిపించారు. ఆత్మీయ అతిథులుగా నిడుమోలు రమా సత్యనారాయణ, పరుచూరి విజయలక్ష్మి, ప్రసూన రామన్, మీరాకుమార్,పరిమి గణేష్, చింతకాయల చిట్టిబాబు, నాగభూషణం,మధుసూదనరావు, కొప్పుల అశోక్ ఆనంద్ తదితరులు కళాకారులను అభినందిస్తూ,సంస్థ నిర్వహిస్తున్న కార్యక్రమాలను కొనియాడుతూ ఆదిరాల జయప్రభు ను ప్రశంసిస్తూ ప్రసంగించారు.

ఘనంగా గుప్పెడు మనసు పుస్తక ఆవిష్కరణ

విశాలాంధ్ర-గుడివాడ : తెలుగు భాషా వికాస సమితి ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక వాసవిచౌక్‌లోని ఆర్యవైశ్య కళ్యాణ వేదికలో ప్రముఖ రచయిత్రి యలమర్తి అనురాధ రచించిన కథా సంపుటి గుప్పెడు మనసు పుస్తకాన్ని ప్రముఖ వైద్యులు డా॥ వల్లూరిపల్లి సుబ్రహ్మమణేశ్వరరావు అవిష్కరిచారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభకు తెలుగు భాషా సమన్వయకర్త డి.ఆర్.డి ప్రసాద్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా డా॥ వల్లూరిపల్లి మాట్లాడుతూ తెలుగు భాష పరిరక్షణకు రచయితలు, సాహితవేత్తలు చేస్తున కృషి అభినందనీయమన్నారు. సమీక్షకులు డా॥ కొడాలి సోమసుందరరావు మాట్లాడుతూ అనురాధ రచించన గుప్పెడు మనసు సంపుటిలోని కథలు మానవత్వం, ఆప్యాయత అనుబంధం, కుటుంబ సంబంధాల ప్రాముఖ్యతకు పెద్దపీట వేశారన్నారు. అనతరం రచయిత్రి అనూరాధను పలు సంస్థలు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో గజల్ గాయకుడు మోకా మాధవరావు, రచయిత వంగా శ్రీనివాస్, కృష్ణా ఆర్ట్స్ కల్చలర్ అసోసియేషన్ వ్యవస్థాపకులు పి.వి సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

బ్రాహ్మణ కార్పొరేషన్‌ను బలోపేతం చేయాలి

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్) : రానున్న సార్వత్రిక ఎన్నికలు రాజకీయ పార్టీలకు ఎంత ముఖ్యమో బ్రాహ్మణ సమజానికి కూడా అంటే ముఖ్యము అని శ్రీ వేద విజ్ఞాన పరిషత్ చైర్మన్ దేవరకొండ వెంకట బాల సుబ్రహ్మణ్యం తెలిపారు ఆదివారం గాంధీనగర్ లోని చాంబర్ ఆఫ్ కామర్స్ & ఇండస్ట్రీ హాల్లో శ్రీ వేద విజ్ఞాన పరిషత్ సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో బ్రాహ్మణ సామాజిక వర్గానికి చెందిన పలువురు ప్రముఖులు పాల్గొని భవిష్యత్తు కార్య చరణ పలు విధానాలను తీర్మానాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏ పార్టీల వారైనా బ్రాహ్మణులకు ఎన్ని సీట్లు కేటాయిస్తారో ఎన్నికల ముందు క్లియర్ గా స్పష్టత ఇవ్వాలన్నారు రాష్ట్రంలో తమ సామాజిక వర్గం ఉన్న నిష్పత్తి ప్రకారంరాజకీయ పార్టీలు బ్రాహ్మణులకు రెండు (2) శాసన మండలి సీట్లు, ఒక (1) రాజ్యసభ సీటు కేటాయించాలన్నారు. 2014లో రాష్ట్ర ప్రభుత్వాలు రాష్ట్ర మంత్రి వర్గంలో స్థానం కల్పించలేక పోవడం, మేధావుల సభగా చెప్పుకొనే శాసనమండలి లో బ్రాహ్మణులకు స్థానం లేక పోవడం దురదృష్టకరం అన్నారు. ప్రస్తుతం రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్‌లో వున్న సబ్దతను తొలగించి దానిని మరింత బలోపేతం చేసే విధంగా నిధులు కేటాయించాలన్నారు. విదేశీ, ఉన్నత విద్యకు ప్రాధాన్యతను కల్పిస్తూ, బ్రాహ్మణ కార్పొరేషన్ ద్వారా అవకాశాలను కల్పిస్తూ, అందుకు తగిన నిధులను కేటాయించాలన్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం శాసన సభ్యులుగా ఉన్న బ్రాహ్మణ అభ్యర్థులు మరల విజయం సాధిస్తారని వారికి మరల సీట్లు కేటాయించాలని,అలాగే ఉత్తరాంధ్ర, రాయలసీమ ప్రాంతాలలో బ్రాహ్మణులకు శాసన సభ స్థానాలను కేటాయించాలని తీర్మానం చేశారు.ఈ సమావేశంలో వెంపరాల నారాయణమూర్తి, తురగ శ్రీరామ్,చలపతిరావు తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకుల ప్రైవేటీకరణను వ్యతిరేకించాలి

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్) : రానున్న సాధారణ పార్లమెంట్ ఎన్నికల్లో ప్రభుత్వ రంగ బ్యాంకుల ప్రైవేటీకరణను ప్రోత్సహిస్తున్న పార్టీలను వ్యతిరేకించాలని పలువురు నాయకులు పిలుపునిచ్చారు. ఆదివారం అమ్మ కల్యాణ మండపంలో కెనరా బ్యాంక్ వర్క్‌మెన్ ఎంప్లాయిస్ యూనియన్ ఏపీ స్టేట్ కమిటీ 16వ రాష్ట్ర సదస్సు జరిగింది.ఈ సదస్సుకు కెనరా బ్యాంక్ వర్క్‌మెన్ ఎంప్లాయిస్ యూనియన్ చైర్మన్ సి.శ్రీనివాసులురెడ్డి అధ్యక్షత వహించారు.ఈ సందర్భంగా జరిగిన సభలో సిబిడబ్ల్యుఎ వైస్ చైర్‌పర్సన్ ఎం.లలితారెడ్డి, ఏఐబిఈఏ జనరల్ సెక్రటరీ బి.ఎస్.రాంబాబు కెనరా బ్యాంక్‌ని ఎంతగానో ముందుండి నడిపిస్తున్న ఉద్యోగులను కొనియాడారు. ప్రస్తుత బ్యాంకింగ్ రంగంలో అతిపెద్ద సమస్య మొండి బకాయిలు గుదిబండగా ఉండటంతో బ్యాంకులు ఇబ్బందులు పడుతున్నాయన్నారు.బకాయి వలన బ్యాంకులు యొక్క ఆస్తులను కరిగించడమే కాకుండా తీవ్ర నష్టాలు కలగజేస్తుందన్నారు.అంతేకాకుండా ఆర్.బి.ఐ సరికొత్తగా ప్రవేశపెట్టిన మొండి బకాయి దారులతో చర్చలు జరపడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు.ఇది వాళ్ళని బుద్ధిగించడమే అవుతుందని కచ్చితంగా నిజాయితీగా బ్యాంకుల్లో అభివృద్ధికి తోడ్పడుతున్న ఎంతోమంది నిజాయితీపరులైన లబ్దిదారులని ఇది మోసం చేయడమే అవుతుందన్నారు. అంతేకాకుండా రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో బ్యాంకు ఉద్యోగులు బ్యాంకుల్లో ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా గళం విప్పే పార్టీలు లేదా అభ్యర్థులను మాత్రమే ఎన్నుకోవాలని సూచించారు.జనరల్ మేనేజర్ రవి వర్మ మాట్లాడుతూ విజయవాడ శాఖ కెనరా బ్యాంక్ అన్ని రీజియన్లు కన్నా ముందు ఉండడం గర్వకారణమన్నారు.అందుకు కారణమైన సిబ్బందిని, ఎంప్లాయిస్‌ని పేరుపేరునా కొనియాడారు రానున్న రోజుల్లో ఎటువంటి సమస్యలకైనా ముందుండి పోరాడతామన్నారు.వైస్ చైర్మన్ జెపి శర్మ మాట్లాడుతూ నోట్ల రద్దు సమయంలో బ్యాంకు ఉద్యోగులు ఎంత కష్టపడి ప్రజలకు చేసిన సేవలు కొనియాడారు.అంతేకాకుండా కోవిడ్ 19 సమయంలో ప్రాణాలు తెగించి బ్యాంకు ఉద్యోగులు పని చేశారన్నారు.అనంతరం చైర్మన్‌గా సి.శ్రీనివాస రెడ్డి,సెక్రటరీగా బొమ్మ దేవర్ల వడియావర్లు (బాబు),కోశాధికారిగా టి శ్రీనివాసరాజులను ఎగ్రీవంగా ఎన్నుకున్నారు.ఈ సమావేశంలో ఏ.పి.టి.బి.ఎఫ్ నాయకులు కె.రాధాకృష్ణ,వై శ్రీనివాసరావు,కెవిఎస్ రవికుమార్,పి.అజయ్ కుమార్,కృష్ణాజిల్లా బ్యాంకు ఉద్యోగుల కమిటీ ప్రెసిడెంట్ ఎం.సుబ్బారావు పాల్గొన్నారు.

మనోల్లాస భరితం జెఎన్ఎస్ చిత్ర గీతాల గానం

విశాలాంధ్ర-విజయవాడ కల్చరల్ : జెఎన్ఎస్ సరాగాలు పేరిట ఆదివారం సాయంత్రం బాలోత్సవ్ భవన్‌లో జరిగిన సినీ సంగీత విభావరి శ్రోతల మనసులను ఉల్లాసపరుస్తూ మంత్రముగ్ధులను చేసింది. ఝాన్సీ ఆధ్వర్యంలో కొండేటి శ్రీ దుర్గా నాగమణి, శ్యాంప్రసాద్ మహేశ్వరి, రాజ్యం, కేశవరావు, దయానంద్,నాగరాజు, శేఖర్ బాబు, హనుమంతరావు తదితరులు దాదాపు 40 మంది అనుభవమున్న గాయనీ గాయకులు నాటి నేటి మేటి చిత్రాలలోని పాటలను శృతిలయలు పోషించుకుంటూ సాహిత్య భావాన్ని శ్రోతలకు అందిస్తూ హర్షధ్వానాలందుకుంటూ పాడి వినిపించారు. అతిథులుగా గోళ్ళ నారాయణరావు,చింతకాయల చిట్టిబాబు,బందారు నరసింహారావు తదితరులు పాల్గొని కళాకారులను అభినందిస్తూ ప్రసంగించారు.

మణిపూర్‌లో మహిళలపై దాడిచేసిన వారిని కఠినంగా శిక్షించాలి

విశాలాంధ్ర-ఎ.కొండూరు : మణిపూర్‌లో ఇద్దరు మహిళలను నగ్నంగా ఊరేగించి అత్యాచారం జరిపి హత్య చేసిన సంఘటనకు దేశం సిగ్గుపడు తుందని మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు గద్దె కృష్ణారెడ్డి మండల ప్రధాన కార్యదర్శి వనపర్ల డేవిడ్ రాజు ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం సిగ్గుపడుతుందో లేదో తెలియదు అన్నారు. మే 4వ తేదీన సంఘటన జరిగితే మే 18 వ తేదీన జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేశారని దుండగులను అరెస్టు చేయలేదన్న ఆరోపణకు కేంద్రం సమాధానం చెప్పాలన్నారు. ప్రజాస్వామ్య దేశంలో ఇలాంటి సిగ్గులేని చర్యలు అదుపు చేయకపోతే ప్రపంచ దేశాల ముందు సిగ్గు పోతుందని వారు పేర్కొన్నారు. కొన్ని నెలలుగా మణిపూర్ తగలబడుతుంటే ప్రధానమంత్రి నరేంద్ర మోడీ మౌనవ్రతం వీడలేదన్నారు. మణిపూర్ ఘటనపై సుప్రీంకోర్టు సిజే సుమోటోగా స్పందించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. దేశంలోని పలు రాష్ట్రాల్లో దళితుల మీద గిరిజనుల మీద దాష్టికాలు జరుగుతున్న ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవడం లేదని ఆరోపించారు. ఇటీవల యూపీలో దళిత యువకుడి చేత మూత్రం తాగించారని రాజస్థాన్ లో దళిత యువకుడి తలపై మూత్రం పోశారని ఏపీలో గిరిజన యువకుడిని చావబాది నోట్లో మూత్రం పోశారని పేర్కొన్నారు. ఏపీలో శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించాయని గిరిజన ఘటనకు కులముద్రవేసి వైకాపా నాయకులు నీచ రాజకీయాలు చేస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా మణిపూర్ ఘటన లో దోషులను కఠినంగా శిక్షించి ఇలాంటి సంఘటనలు మరలా పునరావృత్తం కాకుండా గట్టి భద్రతా చర్యలు చేపట్టాలని వీరు డిమాండ్ చేశారు.

లీగల్ మెట్రాలజీ తనిఖీలు

విశాలాంధ్ర-విజయవాడ (క్రైమ్): విజయవాడలో లీగల్ మెట్రాలజీ అధికారులు దాడులు నిర్వహించారు. తూనికలు కొలతల్లో జరుగుతున్న మోసాలను ఆరికట్టేందుకు ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. ఆదివారం కావడంతో చికెన్, మటన్ షాపులతో పాటు చేపల దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు. కొలతల్లో తేడా ఉన్న ఓ దుకాణం పై కేసు నమోదు చేశారు. తూనికలు, కొలతలల్లో అక్రమాలను అడ్డుకునేందుకు లీగల్ మెట్రాలజీ అధికారులు రంగంలోకి దిగారు. విజయవాడ బీసెంట్ రోడ్డులోని మహింతి మార్కెట్ లో ఉదయం నుంచి తనిఖీలు చేపట్టారు.ఆదివారం కావడంతో మాంసం దుకాణాలపై ప్రత్యేక దృష్టి సారించిన అధికారులు సిబ్బందితో విస్తృతంగా తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా తునికలు, కొలతల శాఖ అధికారి మునిరాజు మాట్లాడుతూ అధికారుల ఆదేశాలతో పలు దుకాణాలపై దాడులు నిర్వహించామని తెలిపారు.శాఖ అమోదించిన రాళ్లను మాత్రమే వినియోగించాలని, ఎలక్ట్రానిక్ యంత్రాలను ఎప్పటికప్పుడు పరిశీలించుకోవాలని ఆయన సూచించారు. తూనికల్లో తేడాలు చూపిస్తున్న ఓ దుకాణం పై కేసు నమోదు చేసి జరిమానా విధించినట్లు ఆయన వెల్లడించారు.

గడపగడపకు మన ప్రభుత్వంను జయప్రదం చేయండి

విశాలాంధ్ర-పెదపారుపూడి : పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్ పాల్గొనే గడప,గడపకు మన ప్రభుత్వం సోమవారం చిన పారుపూడి గ్రామంలో ఉదయం 6 గంటలకు ప్రారంభమవుతున్నందున మండల స్థాయి అధికారులు, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొని జయప్రదం చేయాలని మండల కన్వీనర్, ఎంపీపీ గోగం సురేష్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

సాగు భూములకు పట్టాల సాధనకు
ఉద్యమాలు ఉధృతం చేయాలి

విశాలాంధ్ర-మైలవరం : మూడు, నాలుగు దశాబ్దాలుగా పేదల సాగులో ఉన్న అన్ని రకాల ప్రభుత్వ బంజరు భూములకు పట్టాల సాధనకు ఉద్యమాలను మరింత ఉధృతం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి సీహెచ్ కోటేశ్వరరావు పిలుపునిచ్చారు. ఆదివారం మైలవరం సీపీఐ కార్యాలయంలో జరిగిన మైలవరం నియోజకవర్గ ముఖ్య కార్యకర్తలు సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కోటేశ్వరరావు మాట్లాడుతూ జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో మండలాల్లో, మైలవరం మండలంలోనూ గతంలో సీపీఐ వ్యవసాయ సంఘాల ఆధ్వర్యంలో ఉవ్వెత్తున సాగిన భూపోరాట సంఘటనలను వివరిస్తూ అనేక కేసులు, దౌర్జన్యాలను, దాడులను కూడా తట్టుకుంటూ వీరోచితంగా నిర్వహించిన భూపోరాటాల ఫలితంగా వేలాది ఎకరాలను సాధించుకుని అనుభవించుట జరుగుతుందని తెలిపారు. మన పేదల సాగులోనున్న భూములకు పట్టాలకోసం అధికారులకు ఎన్ని సార్లు మొరపెట్టుకున్నా ఇంత వరకు ఏ మాత్రం ప్రయోజనం జరగలేదని ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా ఎన్నికల సంద ర్భంలో శుష్క వాగ్దానాలు మినహా పేదలకు ఒరిగిందేమీలేదని విమర్శించారు. సాగు దార్లంతా సమైక్యంగా రెట్టింపు పట్టుదలతో పోరాటాలను ఉధృతం చేసి పట్టాలను సాధించుకోవాలని ఆయన సూచించారు. సీపీఐ నాయకులు బాణావత్ పెదబాలు నాయక్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో మైలవరం నియోజకవర్గ సీపీఐ కార్యదర్శి బుడ్డి రమేష్ మాట్లాడుతూ గ్రామాల స్థాయిలో పార్టీ పటిష్టంగా ఉన్నప్పుడే మన భూపోరాటాలను జయప్రదంగా ముందుకు తీసుకుపోగలం అన్నారు. మహిళా సమైక్య జిల్లా నాయకురాలు సీహెచ్ దుర్గాకోటేశ్వరావు , మైలవరం మండల ఇన్‌చార్జ్ కార్యదర్శి బుద్ధవరపు వెంకట్రావు, రెడ్డిగూడెం మండల కార్యదర్శి అడపా సుబ్బారావు తదితరులు ఈ సమావేశంలో భూపోరాటాలకు సంబంధించిన అనేక విషయాలపై ప్రసంగించారు. ఈ సమావేశంలో రెడ్డిగూడెం, మైలవరం, ఇబ్రహీంపట్నం మండలాల నాయకులు, కార్యకర్తలు దేవరపల్లి బుజ్జి, పి. వీరాస్వామి, జె.వెంకటేశ్వరరావు, రవి, కె.సుబ్బారావు, సీహెచ్ ఏసుదాస్, సాయిబాబు, వి.ఏసు, కేసీతయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు 'స్పందన' తాత్కాలికంగా రద్దు: కలెక్టర్

విశాలాంధ్ర-విజయవాడ : ప్రతి సోమవారం మండల, డివిజన్, జిల్లా స్థాయి కలెక్టరేట్‌లో నిర్వహించే స్పందన కార్యక్రమాన్ని తాత్కాలికంగా రద్దు చేసినట్లు జిల్లా కలెక్టర్ ఎస్ ఢిల్లీరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 24వ తేదీన గుంటూరు జిల్లాలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి నవరత్నాలు పేదలందరికీ ఇళ్ళు పథకంలో భాగంగా లబ్ధిదారులకు మంజూరు పత్రాల పంపిణీ కార్యక్రమానికి జిల్లా అధికారులకు విధులు కేటాయించినందున స్పందన కార్యక్రమాన్ని తాత్కాలికంగా రద్దు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. జిల్లాలోని ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని కలెక్టర్ తెలిపారు.

విశాలాంధ్ర
ఎన్టీఆర్ జిల్లా

నేడు వ్యవసాయ కార్మిక సంఘ నియోజకవర్గ మహాసభ

విశాలాంధ్ర-తిరువూరు: తిరువూరు మండలం పెద్దవరంలో నేడు జరుతుగున్న వ్యవసాయ కార్మిక సంఘం నియోజకవర్గస్థాయి 23వ మహాసభను విజయవంతం చేయాలని సంఘ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి మర్యకట్ల త్యాగరాజు, సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ఎస్‌కె నాగుల్‌మీరా కోరారు. గ్రామీణ పేద ప్రజలకు అండగా నిలిచిన వ్యవసాయ కార్మిక సంఘం పశ్చిమ కృష్ణా జిల్లాలోని అనేక గ్రామాల్లో ప్రజా ఉద్యమాలు నిర్వహించిందని, ప్రజా సమస్యల పరిష్కారం కోసం సమస్యల పరిష్కారం కోసం విశేషంగా కృషి చేసిందని ఆయన వెల్లడించారు. భవిష్యత్తులో భూమి కోసం భుక్తి కోసం, కార్మికుల, కర్షకుల సమస్యల పరిష్కారం కోసం వ్యవసాయ కార్మిక సంఘం ఉద్యమిస్తుందని, అర్హులైన వృద్ధాప్య, వికలాంగులు, వితంతువులకు నెలకు రూ.5 వేలు పెన్షన్ ఇప్పించడం కోసం, పేద ప్రజలకు నివేశన స్థలాలు పంపిణీ, ఉపాధి హామీ పథకం పటిష్ట అమలు కోసం ఉద్యమ కార్యాచరణ రూపొందిస్తామని సీపీఐ తిరువూరు నియోజకవర్గ కార్యదర్శి ఎస్ కె నాగులు మీరా తెలిపారు. సీపీఐ జిల్లా కార్యదర్శి సీ హెచ్ కోటేశ్వరరావు, సంఘ ఎన్టీఆర్ జిల్లా నాయకులు తూము కృష్ణయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి చిలుకూరి వెంకటేశ్వరరావు పాల్గొని ప్రసంగిస్తారని, సంఘ సభ్యులు సకాలంలో హాజరై మహాసభను విజయవంతం చేయాలని త్యాగరాజు విజ్ఞప్తి చేశారు.

నేడు మునిసిపల్ కమిషనర్‌ను కలవనున్న దోనేపూడి శంకర్

విశాలాంధ్ర-జగ్గయ్యపేట : పట్టణంలో దీర్ఘకాలంగా ఉన్న డంపింగ్ యార్డ్ తదితర సమస్యలపై జగ్గయ్యపేట మునిసిపల్ కమిషనర్‌తో చర్చించేందుకు సీపీఐ జిల్లా డిప్యూటీ కార్యదర్శి దోనేపూడి శంకర్ సోమవారం జగ్గయ్యపేటకు వస్తున్నట్లు పట్టణ కార్యదర్శి జూనెబోయిన శ్రీనివాసరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు.

మట్టి ఖర్చులకు రూ.10 వేలు

విశాలాంధ్ర-వత్సవాయి: మక్కపేట గ్రామ ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘ సభ్యుడు అజ్మీరు వెంకటయ్య కుటుంబానికి మట్టి ఖర్చుల నిమిత్తం వారి కుటుంబసభ్యులకు మక్కపేట సొసైటీ అధ్యక్షులు కొండబోలు వెంకట బ్రహ్మం రూ.10 వేలు ఇచ్చారు. గ్రామ వైకాపా అధ్యక్షులు కనగాల రమేష్, మక్కపేట సొసైటీ అధ్యక్షులు కొండబోలు వెంకట బ్రహ్మం, తదితరులు పాల్గొన్నారు

ట్రాక్టర్ ట్రక్ బోల్తా - ముగ్గురికి గాయాలు

విశాలాంధ్ర-వీరులపాడు: ట్రాక్టర్ చింతకాయ విరగడంతో వెనుక ఉన్న ట్రక్కు బోల్తా పడ్డ ఘటనలో ముగ్గురు గాయాల పాలయ్యారు. వీరులపాడు మండలం జగన్నాథపురం గ్రామ శివారు మూలమలుపు వద్ద పరిటాల గ్రామానికి చెందిన వంశీకృష్ణ సిమెంట్ వర్క్స్ ఫ్యాక్టరీ నుండి ప్రీ కాస్టింగ్ వాల్స్ లోడుతో ఎర్రుపాలెం గ్రామానికి తీసుకువెళ్తుండగా ఈ ఘటన సంబంధించింది. ట్రాక్టర్ ట్రక్కులో ఉన్న ముగ్గురికి గాయాల అవటంతో 108 వాహనంలో చికిత్స నిమిత్తం నందిగామ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

దర్జాగా వచ్చేసి...నగదు దోచేసి...!

విశాలాంధ్ర-విస్సన్నపేట టౌన్: విస్సన్నపేటలో ఒక నిందితుడు దర్జాగా వచ్చి, నగదు దోచుకుపోయిన ఘటన ఆదివారం వెలుగుచూసింది. స్థానిక నూజివీడు రోడ్డులోని అంబికా రెస్టారెంట్‌లోకి ఆదివారం మధ్యాహ్నం ఒక వ్యక్తి చొరబడ్డారు. యాజమాన్యం కౌంటర్ నుంచి వెళ్లి, వంటల వద్ద ఉన్న సమయంలో లోపలికి వచ్చిన ఆయన అక్కడ ఎవరూ లేని విషయాన్ని గుర్తించి, కౌంటర్ తెరచి, లోపల ఉన్న నగదును తస్కరించారు. అక్కడే నిలబడి, మరీ నగదును జేబులో సర్దుకోవటం సీసీ కెమెరాల్లో రికార్డయ్యింది. రెస్టారెంట్‌లో పనిచేసే కార్మికులకు జీతాలు చెల్లించేందుకు సిద్ధంగా ఉంచిన సుమారు రూ.25వేల నగదు చోరీకి గురైనట్లు రెస్టారెంట్ యాజమాన్యం విస్సన్నపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు.

సంచలనం రేపిన మిల్కీ ప్రసాద్ ఉదంతం!

విశాలాంధ్ర-విస్సన్నపేట టౌన్: ఏలూరు జిల్లాలో ఏసీబీ అధికారులకు పట్టుబడిన అధికారి కేడీవీఎం.ప్రసాద్‌బాబు(మిల్కీ ప్రసాద్) ఉదంతం విస్సన్నపేట మండలంలో సంచలనం రేపింది. 1994లో ప్రసాద్‌బాబు సర్వశిక్షా అభయాన్ ప్రాజక్టు డైరక్టర్‌గా పనిచేస్తూ విస్సన్నపేట మండల ప్రత్యేకాధికారిగా నియమితులయ్యారు. కొద్దిరోజుల్లోనే నాటి ప్రభుత్వం పదోన్నతిపై తిరువూరు నియోజకవర్గ ప్రత్యేకాధికారిగా ఆయనకు బాధ్యతలు అప్పగించింది. అప్పట్లో ఎస్ఎస్ఏ పీడీగా ప్రభుత్వ పాఠశాలల్లో యూనిఫారం దుస్తుల కాంట్రాక్టును రాష్ట్రంలోని పలు జిల్లాలకు సరఫరా చేసే బాధ్యతను ఆయన విస్సన్నపేట మండలానికి చెందిన ఒక వ్యక్తికి అప్పగించారని, దీనిలో పెద్దమొత్తం చేతులు మారాయనే ఆరోపణలు వచ్చాయి. ఈ ఆరోపణలు ఎక్కువయ్యే సమయంలోనే సంబంధిత కాంట్రాక్టు పొందిన వ్యక్తి ప్రసాద్‌బాబు భార్య ప్రస్తుత కైకలూరు జడ్పీటీసీ సభ్యురాలు బేబీ సరోజినికి అధికారపార్టీ(టీడీపీ) తిరువూరు అసెంబ్లీ టిక్కెట్ ఇస్తుందంటూ ఫ్లెక్సీలతో ప్రచారం చేయటంతోపాటు, పలు గ్రామాల్లో ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టారు. ఎస్ఎస్ఏలో సీఆర్పీల నియామకంలో సైతం నిబంధనలకు తిలోదకాలిచ్చినట్లు నాడు ఆరోపణలు వెల్లువెత్తగా, అప్పట్లో నిబంధనలకు విరుద్ధంగా బాధ్యతలు పొందిన వ్యక్తి నేటికీ విస్సన్నపేటలో సీఆర్పీగా విధులు నిర్వర్తిస్తున్నారనే ప్రచారం జరుగుతోంది.

కేళి నరసింహారావు కన్నుమూత

విశాలాంధ్ర-తాడేపల్లి : మంగళగిరి తాడేపల్లి కార్పొరేషన్ పరిధిలోని తాడేపల్లి మున్సిపల్ ఉద్యోగి కేళి నరసింహరావు(53) శనివారం రాత్రి కన్నుమూశారు. గత కొంతకాలంగా ఆయన అనారోగ్యంతో బాధపడుతూ శనివారం రాత్రి తుది శ్వాస విడిచారు. ఆయన మరణ వార్త తెలుసుకున్న పలువురు రాజకీయ పార్టీ నాయకులు కేళి నరసింహారావు భౌతికకాయాన్ని సంద ర్శించి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు. కేళి నరసింహారావు భౌతిక కాయానికి నివాళులర్పించిన వారిలో సీపీఐ నియోజకవర్గ సహాయ కార్యదర్శి కంచర్ల కాశయ్య, తాడేపల్లి పట్టణ సహాయ కార్యదర్శి తుడిమెల్ల వెంకటయ్య, సీనియర్ నాయకులు మానికొండ డాంగే, మునగాల రామారావు, కర్రి వెంకటేశ్వరరావు, కర్రి సురేష్, సీపీఎం పట్టణ కార్యదర్శి బురగ వెంకటేశ్వర్లు, సీనియర్ నాయకులు జొన్న శివ శంకర్ రావు, దొంతిరెడ్డి వెంకట్ రెడ్డి, కె.వెంకయ్య, వైసీపీ ఎంటీఎంసీ నగర అధ్యక్షులు దొంతిరెడ్డి వేమారెడ్డి, దొంతిరెడ్డి రామకృష్ణారెడ్డి, మేకా అంజిరెడ్డి, గోరె బాబు, కేళి వెంకటేశ్వరరావు, మాచర్ల అబ్బు, గంగాధర్, కళ్యాణ్ సుబ్బు, నవీన్, కేళి కరుణాకర్, వైసీపీ తాడేపల్లి పట్టణ కన్వీనర్ బుర్రముక్కు వేణుగోపాలస్వామి రెడ్డి, ముదిగొండ ప్రకాష్, టీడీపీ తాడేపల్లి పట్టణ అధ్యక్షులు వల్లభనేని వెంకట్రావు, మాజీ అధ్యక్షులు జంగాల సాంబశివరావు, కాటాబత్తుల నిర్మల, అద్దంకి మురళి, అమీర్, హరికృష్ణ, ధనుజ్ తదితరులు ఉన్నారు. అనంతరం నరసింహారావు అంతిమ యాత్ర సాగింది.

వీసీబీ సభ్యుల పిల్లలకు రూ.24 లక్షలతో విద్యార్థి ప్రతిభా పురస్కారాలు

విశాలాంధ్ర- విజయవాడ : తెలుగు రాష్ట్రాల్లోని 50 బ్రాంచిలుగా విస్తరించిన విశాఖపట్నం కో ఆపరేటివ్ బ్యాంక్(వీసీబీ) ఆధ్వర్యంలో ఈ ఏడాది బ్యాంకు సభ్యుల పిల్లలకు రూ. 24 లక్షలతో విద్యార్థి ప్రతిభా పురస్కారాలు అందజేస్తున్నట్టు బ్యాంకు డైరెక్టర్ వి. చంద్రశేఖరరావు తెలిపారు. నగరంలోని ఫన్‌టైమ్ క్లబ్ రోడ్డులోని వీసీబీ పడమట బ్రాంచి ఆవరణలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో పడమట, వన్‌టౌన్ బ్రాంచిలలోని ఏడుగురు విద్యార్థులకు రూ.45 వేల విలువైన చెక్కులు, మెరిట్ సర్టిఫికేట్‌తోపాటు చిరుకానుకలను బ్యాంకు డైరెక్టర్లు వి. చంద్ర శేఖరరావు, పొట్లూరి వెంకట రమణరావు, చిన్న కోటేశ్వరరావు, జోనల్ మేనేజర్ సీహెచ్‌వీఆర్ సుబ్రహ్మణ్యం అందజేశారు. మెరిట్ విద్యార్థులు ఇ. రిషి రాఘవేంద్ర, కె. సాయివంశీ, బి. వెనీషా, పి.శ్రీహాసిని, కె. కృష్ణప్రవల్లిక, జి. ఎం.వి. సుమంత్, ఎం.డి గౌసియాబేగంలు అవార్డులు అందుకున్నారు. ఈ సందర్భంగా డైరెక్టర్ రమణరావు అధ్యక్షతన జరిగిన సభలో డైరెక్టర్ చంద్రశేఖరరావు మాట్లాడుతూ తమ బ్యాంకు ప్రతి సంవత్సరం అందజేస్తున్న ప్రతిభా పురస్కారాలు సభ్యుల్లోని పిల్లలకు ఇదొక ప్రేరణగా నిలుస్తుందని, భవిష్యత్‌లో పురస్కార గ్రహీతలు మరింత ఉన్నత స్థితికి చేరుకోవడానికి ఇది దోహదపడుతుందన్నారు. ఈ ఏడాది పదవ తరగతిలో 90 శాతంపైగా మార్కులు సాధించిన విద్యార్థికి రూ.5 వేలు, ఇంటర్ విద్యార్థికి రూ.7,500, ఎంసెట్..నీట్‌లో 1000 లోపు ర్యాంకర్‌కు రూ.10 వేల చొప్పున నగదు ప్రోత్సాహకాలు అందిస్తున్నామన్నారు. మరో డైరెక్టర్ కోటేశ్వరరావు మాట్లాడుతూ సహకార వ్యవస్థలో నూతన విధానాలతో ప్రగతిపథంలో సాగుతున్న విశాఖపట్నం కోఆపరేటివ్ బ్యాంకు దేశంలోని 1481. నాన్ షెడ్యూల్డ్ "కోఆపరేటివ్ అర్బన్ బ్యాంకుల్లో అతిపెద్ద బ్యాంకుగా గుర్తింపు సాధించడం సభ్యులందరికీ గర్వకారణమన్నారు. తమ బ్యాంకు సహకార స్ఫూర్తితో సభ్యుల సంక్షేమం కోసం ఆరోగ్య బీమా పథకం, వారి పిల్లలకు ప్రతిభా పురస్కారాలు లాంటి పథకాలను అమలు చేస్తుందన్నారు. 2004-05 ఆర్థిక సంవత్సరంలో వీసీబీ ప్రారంభించిన ప్రతిభా పురస్కారాల క్రింద ఇప్పటి వరకు 4257 మంది విద్యార్థులకు రూ.2 కోట్లు అందజేసినట్లు చెప్పారు. విజయవాడ జోనల్ మేనేజర్ సీహెచ్ వీఆర్ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ఆర్థిక కార్యకలాపాల తోపాటు సభ్యుల సంక్షేమం, వారి పిల్లల కోసం ప్రత్యేక పథకాలను అదులు చేస్తున్న విశాఖపట్నం కోఆపరేటివ్ బ్యాంకు సేవలను మరింత మందికి చేర్చేలా సభ్యులు కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో విజయవాడ పడమట, వన్‌టౌన్ బ్రాంచిల మేనేజర్లు కె. కొండబాబు, సీహెచ్ సత్యన్నారాయణ, వి, కావ్య, సంప్రదింపుల కమిటీ సభ్యులతోపాటు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ప్రతిభావంతులైన విద్యార్థులకు నగదు పురస్కారాలు

విశాలాంధ్ర-విజయవాడ: ప్రతిభావంతులైన విద్యార్థులకు కోనేరు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నగదు పురస్కారాలు అందజేశారు. గోపాలలోని ట్రస్ట్ వృద్ధాశ్రమంలో ఆదివారం కోనేరు నరేంద్రబాబు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర జోనల్ మేనేజర్ ప్రసాద్ ద్వారా రూ.2.48 లక్షల పారితోషికాలను విద్యార్థులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ కార్యదర్శి భీమేశ్వరరావు, కోశాధికారి శివాజీ, వ్యవస్థాపక ట్రస్టీలు నారాయణరావు, వాసుదేవరావు, మాజీ మేయర్ శ్రీధర్, నార్ల మాలతి, ట్రస్టీలు వెంకట రామారావు, నాగేశ్వరరావు, రాధాకృష్ణ, వెంకట ప్రసాద్, గోపాల మాజీ సర్పంచ్ కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఎస్‌బీఈ ఫ్లాట్ ఓనర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక

విశాలాంధ్ర-విజయవాడ: నున్నలో పవర్ గ్రిడ్‌కు సమీపంలో ఉన్న 90 ఫ్లాట్స్ గల శ్రీ సాయి బాలాజీ ఎన్‌క్లేవ్ అపార్టు మెంట్ వాసులు రోజువారి మౌలిక సౌకర్యాల నిర్వహణ కోసం శ్రీ సాయి బాలాజీ ఎనక్లేవ్ ఫ్లాట్ ఓనర్స్ అసోసియేషన్ పేరుతో నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఇటీవల నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ఫ్లాట్ ఓనర్స్ కమిటీ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా కొత్తగా ఎన్నికైన సభ్యులు మాట్లాడుతూ మౌలిక సదుపాయల కల్పన,పర్యావరణ పరిరక్షణ కోసం శక్తివంచన లేకుండా పని చేస్తామని చెప్పారు. నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులు ఫ్లాట్ ఓనర్స్, స్థానికులు శుభాకాంక్షలు తెలిపారు. నూతన కమిటీ వివరాలు: అధ్యక్షులు జీవీఎస్. శివప్రసాద్, ఉపాధ్యక్షులు ఎం.బాబూప్రసాద్, కార్యదర్శి సయ్యద్ నసిరుద్దీన్, సహాయ కార్యదర్శి కె.కళ్యాణరావు, కోశాధికారి వి.వెంకట రమణమూర్తి, కార్యవర్గ సభ్యులు జి.స్వర్ణలత, బి.శ్రీనివాస హరిప్రసాద్, ఎస్ఎస్‌వి. జానకిరామ్, జి.బ్రహ్మయ్య ఉన్నారు.

దేహదారుఢ్యం, వ్యక్తిత్వ వికాసం ప్రకృతిలో ఉల్లాసం

అవార నదిలో పిల్లల శిబిరం

విశాలాంధ్ర-విజయవాడ : కారుమబ్బులు కమ్ముతున్నా, వాన తుంపరలు పడుతున్నా, వందలాది చిన్నారులు, వారి తల్లిదండ్రులతో వేకువనే వడివడిగా కృష్ణానది దక్షిణతీరాన వారధి దిగువన చేరి ప్రకృతిలో పిల్లల శిబిరం పండుగలా జరుపుకున్నారు. ప్రకృతి, పర్యావరణ పరిరక్షణ సంస్థ అవార ఆధ్వర్యాన జరిగిన ఈ కార్యం ఇసుకతిన్నెలలో శుచీకరణ, పరుగుతో ప్రారంభమై, ఆటపాటల క్రమంలో గద్య, పద్య, పదనిసలతో, జాతీయ గీతాలాపనలతో సాగి, నదిలో ప్రాణరక్షణ ప్రదర్శన, ఈతశిక్షణ, జలక్రీడలతో ముగిసింది. ముఖ్యఅతిథిగా వచ్చిన మాకినేని బసవపున్నయ్య విజ్ఞానకేంద్రం కార్యదర్శి పిన్నమనేని మురళీకృష్ణ మాట్లాడుతూ ఈ శిక్షణా శిబిర కీలకఅంశాలను నిశితంగా విశ్లేషించి, పిల్లలకు ఒక్కొక్కటీ వివరించారు. పాల్గొంటున్న పిల్లల దేహదారుఢ్యానికి, మనోవికాసానికి, వారి సామాజిక సమగ్ర స్పృహకి, ప్రకృతీ పరిరక్షణకు ఒకే చోట, ఒకే పూట దోహదపడటం అబ్బురపాటు విషయమన్నారు. ఎంతో దూరదృష్టితో, నిపుణులతో రూపకల్పన చేయించి, ప్రతి ఆదివారం ఏడేండ్లుగా శ్రమకోర్చి నిరాటంకంగా జరుపుతున్న నిర్వాహకులు శకుంతలాదేవి, (మహిళా, శిశు ఈత కోచ్), ఉపాధ్యాయురాలు షారన్, లైఫ్ గార్డ్ పంకజ్ కుమార్, ఈనాటి సహాయకులు వైష్ణవి, సౌజన్య, యశస్వి, అభినవ్, అరవింద పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఇంద్రాణిలను శ్లాఘించి, అభినందించారు. ఈ ప్రతి ఆదివారపు "ప్రకృతిలో పిల్లల" కార్యక్రమంలో పాల్గొన ఆసక్తిగలవారు 09494126812 వాట్సప్ సందేశం ద్వారా నమోదు చేసుకోవచ్చని నిర్వాహకులు ప్రకటించారు.

చేపల వినియోగాన్ని ప్రోత్సహించాలి

విశాలాంధ్ర-విజయవాడ : చేపల వినియోగాన్ని ఆహార అలవాట్లలో ప్రోత్సహించి, మత్స్య ఉత్పత్తుల్లో ఎక్కువ భాగాన్ని స్థానిక వినియోగంగా పెంచే విధంగా ఫిష్ ఆంధ్ర అవుట్‌లెట్‌లను ఏర్పాటుచేసి ప్రోత్సహిస్తున్నామని జిల్లా కలెక్టర్ ఎస్ ఢిల్లీ రావు ఢిల్లీ అన్నారు. మత్స్య శాఖ ఆధ్వర్యంలో భూమి ఆర్గానిక్స్ ప్రాన్ ఫార్మర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా సంయుక్త సహకారంతో ఆదివారం ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం వద్ద 2 కే రన్ ఆర్గానిక్ వాక్ థాన్ ను జిల్లా కలెక్టర్ ఎస్ ఢిల్లీ రావు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆహార అలవాట్లలో చేపల వినియోగాన్ని పెంచే విధంగా, రాష్ట్రంలో ఉత్పత్తి అవుతున్న మత్స్య సంపదలో మన రాష్ట్ర తలసరి వినియోగం 8 కేజిల నుండి 25 కేజీల వరకు పెంచాలన్న ఉద్దేశంతో మన ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి జగన్మోహన్ రెడ్డి "ఫిష్ ఆంధ్ర" పథకం ద్వారా ప్రోత్సహిస్తున్నారన్నారు. పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలో చేపలను వెజిటేరియన్ గానే భావిస్తారని, మాంసం గుడ్లు లాగే ఎన్నో రకాల పోషక విలువలు కలిగిన చేపలను ఆహారంగా ప్రతి ఒక్కరు తీసుకోవచ్చునన్నారు. సరికొత్త రుచులతో చేపల ఆహారాన్ని పరిచయం చేయడానికి "సి ఫుడ్ ఫెస్టివల్ ను ఈనెల 28, 29, 30" తేదిలలో మత్స్య శాఖ, భూమి ఆర్గానిక్స్ సంయుక్త ఆధ్వర్యంలో నగరంలోని ఏ కన్వెన్షన్ హాలు, లో నిర్వహించడం జరుగుతుందన్నారు. ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం వద్ద ప్రారంభమైన 2కె మారతాన్ రన్ ఫిష్ ఆంధ్ర- ఫిట్ ఆంధ్ర, చేపలు తినండి ఆరోగ్యంగా ఉండండి అంటూ స్లోగన్లతో బందరు రోడ్డు మీదుగా ఏ కన్వెన్షన్ కు చేరుకుంది. ఈ కార్యక్రమంలో భూమి ఆర్గానిక్స్ మేనేజింగ్ డైరెక్టర్ రఘురాం, ప్రాన్ ఫార్మర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షులు వి. లక్ష్మీ కుమార్ రాజు, ఫిషరీస్ జాయింట్ డైరెక్టర్లు వి. వెంకటేశ్వరరావు, హీరా నాయక్,డిప్యూటీ డైరెక్టర్ ఏ నాగరాజా, ఎడిషనల్ డైరెక్టర్ అంజలి ఉన్నారు.

తిరుపతమ్మ సన్నిధిలో భవాని మణికంఠ దంపతులు

విశాలాంధ్ర-పెనుగంచిప్రోలు : గోపయ్య స్వామి సమేత తిరుపతమ్మ అమ్మవారిని, సహ దేవతా మూర్తులను ఆదివారం రాష్ట్ర కృష్ణ బలిజ పూసల కా ర్పొరేషన్ చైర్మన్ కోలా. బావాని, మణికంఠ దంపతులు దర్శించుకున్నారు. వేద పండితులతో దేవస్థానం ప్రధాన అర్చకులతో ప్రత్యేకపూజలు చేశారు. అనంతరం కృష్ణ బలిజ పూసల కార్పొరేషన్ చైర్మన్ కోలా భవాని మణికంఠ మాట్లాడుతూ మాకు ప్రత్యేక దర్శనాలు చేపించిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజలు జగనన్న ప్రభుత్వంలో సస్యశ్యామలంగా ఉండాలి అష్టైశ్వర్యాలు ఆయు రారోగ్యాలతో ఉండేలా చూడాలని మాకు దర్శనం చేయించిన దేవస్థాన యాజమాన్యానికి, అర్చకులకు వేద పండితులకు ముఖ్యంగా మా తోటి రాష్ట్ర కృష్ణ బలిజ పూసల కార్పొరేషన్ డైరెక్టర్ చేని కుమారి రాంబాబు దంపతులుకి ధన్యవాదాలు తెలిపారు, అనంతరం రాష్ట్ర బీసీ కృష్ణ బలిజ పూసల కార్పొరేషన్ డైరెక్టర్ చేని కుమారి మాట్లాడు పెనుగంచిప్రోలు తిరుపతమ్మ అమ్మవారి సహదేవుల దర్శనం చేయించిన అనంతరం చైర్మన్ కోలా భవాని మణికంఠ గురించి మాట్లాడుతూ మా గ్రామ విచ్చేసిన మా చైర్మన్ భవాని మణికంఠ కి దంపతులకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గుంటూరు జిల్లా అడ్వకేట్ కమిషనర్ జ్ఞానేశ్వరి. రాష్ట్ర కృష్ణ బలిజ జనరల్ సెక్రెటరీ పాశం.వెంకటేశ్వరరావు.కృష్ణ బలిజ సంఘం రాష్ట్ర నాయకులు.బత్తుల.ప్రసాద్. రాష్ట్ర బీసీవై సి పి కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎపి రాష్ట్ర పూసల సంఘం ప్రధాన కార్యదర్శి చేని రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ఠాగూర్ గ్రంథాలయంలో అంతరిక్ష వారం

విశాలాంధ్ర-విజయవాడ (లబ్బీపేట) : నగరంలోని ఠాగూర్ స్మారక గ్రంథాలయం నందు సరస్వతీ సామ్రాజ్యం అధ్యక్షతన అంతరిక్ష వారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అయ్యంకి మురళీ కృష్ణ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ అంతరిక్ష రంగంలో భారతదేశ విజయాలు, ప్రయోగాలు, స్పేస్ షిప్ మొదలగు వాటి గురించి వివరించారు. ఇటీవల భారత్ ప్రయోగించిన చంద్రయాన్ 3 విజయవంతం అవ్వటం మనం అంత గర్వించదగ్గ విషయం అని పేర్కొన్నారు. చంద్రయాన్ -3, భారతీయ అంతరిక్ష పరిశోధన సంస్థ చేపట్టిన చంద్ర యాత్ర. భారత చంద్రయాన్ కార్యక్రమంలో ఇది మూడవదన్నారు. చంద్రయాన్-2 లో లాగానే ఇందులో కూడా ఒక రోవరు, ఒక ల్యాండరూ ఉన్నాయి. కానీ ఇందులో ఆర్బిటరు లేదు. దాని ప్రొపల్షను మాడ్యూలే రిలే ఉపగ్రహం లాగా పనిచేస్తుందని వివరించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థిని, విద్యార్థులు , తల్లితండ్రులు , గ్రంథాలయ అధికారిణి కె. రమాదేవి, సిబ్బంది వై.ధనలక్ష్మి, పాల్గొన్నారు

"మెడ్సి" హాస్పిటల్స్ ప్రారంభం

విశాలాంధ్ర-విజయవాడ లబ్బీపేట: స్థానిక మొగల్రాజపురం లో ఆదివారం మెడ్సి హాస్పిటల్స్ ప్రారంభం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, ఆరోగ్య శాఖ మంత్రి విడుదల రజిని పాల్గొన్నారు. హాస్పిటల్ ఎండి శిరీషా రాణివిశిష్ట అతిథులకు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విజయవాడలో తమ మొదటి శాఖను ప్రారంభిస్తున్నందుకు చాలా సంతోషంగా ఉందన్నారు .రెండు తెలుగు రాష్ట్రాల్లో కలిపి 8 శాఖలు నిర్వహిస్తున్నామని తెలియజేశారు. ఐవిఎఫ్ తల్లి పిల్లలు సంరక్షణతో పాటు కొత్తగా రిహాబ్స్ అనే నూతన పద్ధతికి శ్రీకారం చుడుతున్నామని, గుండె, సంబంధిత వ్యాధులు, పక్షవాతం, వచ్చినవారు త్వరగా కోలుకోవడానికి హైదరాబాదులో మెడ్సిస్ బ్లూమ్స్ అని నూతనంగా చైల్డ్ వెల్నెస్ సెంటర్ ప్రారంభిస్తున్నామన్నారు. ఆంధ్రప్రదేశ్ లోనే తొలిసారిగా అక్టోబర్ నాటికి వైజాగ్ లో అడ్వాన్స్ రెహబ్ సెంటర్ ను ప్రారంభిస్తున్నామని, విజయవాడపట్టణ వాసులకు మా సేవలు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటాయని ఆమె అన్నారు. మా హాస్పిటల్స్ లో సాంకేతిక పరిజ్ఞానంతో పాటు, అనుభవిజ్ఞులైన, డాక్టర్ల పర్యవేక్షణలో సేవలు అందిస్తామని ఆమె అన్నారు. అందరి ఆశీస్సులు మా సంస్థపై ఎల్లప్పుడూ ఉండాలని కోరుకుంటున్నానన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రముఖ డాక్టర్లు హాస్పిటల్ సిబ్బంది తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఏపీ ఎస్ఆర్ఎం పాఠ్యప్రణాళికకు ఉన్నత గుర్తింపు

విశాలాంధ్ర-మంగళగిరి : ఏపీ ఎస్ఆర్ఎం యూనివర్సిటీకి మరో అరుదైన గుర్తింపు లభించింది. పాఠ్య ప్రణాళిక రూపకల్పన, అభివృద్ధిలో ప్రతిభ కనబరిచినందుకు గాను అత్యంత ఉన్నత విశ్వవిద్యాలయంగా అవార్డ్‌ను అందుకుంది. తెలంగాణ ప్రభుత్వం ఆధ్వర్యంలో ప్రఖ్యాత మీడియా సంస్థ 'అబ్జర్వ్ నౌ' ఇటీవల హైదరాబాద్ కేంద్రంగా ఎడ్యుకేషన్ లీడర్స్ ద్వితీయ సమ్మేళనాన్ని నిర్వహించింది. ఈ కార్యక్రమంలో ఏపీ, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన పలు యూనివర్సిటీలకు వివిధ అంశాల్లో పురస్కారాలను అందించారు. ఇందులో భాగంగా ఏపీ ఎస్ఆర్ఎం యూనివర్సిటీకి పాఠ్య ప్రణాళిక రూపకల్పన, అభివృద్ధి కేటగిరీలో ఉన్నత విశ్వవిద్యాలయం అవార్డును ప్రకటించారు. ముఖ్యఅతిథిగా హాజరైన గుజరాత్ ప్రభుత్వ కార్మిక శాఖ అడిషనల్ చీఫ్ సెక్రటరీ డాక్టర్ అంజూ శర్మ, అబ్జర్వ్ నౌ చీఫ్ ఎడిటర్ తానియ తికూ చేతుల మీదుగా పురస్కారాన్ని ఏపీ ఎస్ఆర్ఎం యూనివర్సిటీ కమ్యూనికేషన్ డైరెక్టర్ పంకజ్ బలీరియా అందుకున్నారు. యూనివర్సిటీకి అరుదైన గుర్తింపు లభించడం పట్ల వైస్ ఛాన్సలర్ ఆచార్య మనోజ్ కుమార్ అరోరా ఆనందాన్ని వ్యక్తం చేశారు. జాతీయ విద్యా విధానంలో పొందుపరిచిన మార్గదర్శకాలకు అనుగుణంగా పాఠ్యప్రణాళిక రూపకల్పన చేసినట్లు వివరించారు.